క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప డివిజన్ పోస్టల్ శాఖ పరిధిలోని తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్ల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప డివిజన్‌లోని పలు గ్రామాల్లో పైన పేర్కొన్న జీవిత బీమాలో ఏజెంట్ల నియామకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 10 వ తరగతి పాసై 18 నుంచి 50 సంవత్సరాలు వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికయిన అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్ రూ. 5 వేలు ఎన్ఎస్‌సీ రూపంలో చెల్లించాలన్నారు. ఏజెంట్లకు పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు చెల్లిస్తామన్నారు. ఈ నెల 30న జరిగే ఇంటర్వ్యూలకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు మునాఫ్, పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ 9490032695 లేదా 08562–243013 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్: ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యాబుద్ధులు నేర్పి, తమ ఉన్నతికి కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించడం, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించి పాఠశాలకు సహకారం అందించనున్నట్లు తెలిపారు. సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈ సమావేశంలో మిత్రులందరితో కలిసి చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

బహుమతులు ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కడప కల్చరల్ : స్థానిక అక్కాయపల్లెలోని సిద్దిక్ మస్జీద్‌లో శనివారం వేసవిశిక్షణా శిబిరం ముగింపును సందడిగా నిర్వహించారు. మహమ్మదీయా సిద్దిక్ మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు తొలుత పోటీలు నిర్వహించి ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మత గురువు మౌలానా ముఫ్తి మొహమ్మద్ కరిముల్లా, మూలాన జలీల్, ఆయేషా కళాశాల ప్రతినిధి జిలానీబాష, అర్రహ్మాన్ ఇందాద్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ మహబూబ్ బాష, సిద్దిక్ మస్జిద్ ప్రెసిడెంట్ కరీముల్లా, సెక్రటరీ బి సుభానీలు విచ్చేసి మాట్లాడారు. దాదాపు ఈ శిబిరంలో 160 మంది విద్యార్థులు పాల్గొనడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సమ్మర్ కోర్స్ కన్వీనర్ మక్బూల్ అహ్మద్, మౌలాలి, జమీల్ అహ్మద్, డాక్టర్ హిదాయతుల్లా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు పురాణ పుస్తకాల పరిచయ సభ

కడప కల్చరల్ : పురాణాలకు సంబంధించిన రామాయణ, భారత, భాగవతాల పాత్రలు గురించిన పరిచయ సభను ఆదివారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం తెలిపారు. కడప నగరంలోని శ్రీ రామకృష్ణ వానప్రస్థాశమంలో ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీరామకృష్ణ సేవా సమితి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథిగా జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, సభాధ్యక్షులుగా శ్రీ లక్ష్మీ బాబు ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాబు రెడ్డి, పుస్తక పరిచయ కర్తగా వైయస్సార్ జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ జీవీ సాయి ప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్ ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

కడప కోటిరెడ్డి సర్కిల్ : గర్భిణులకు, చంటి బిడ్డలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. శనివారం కడప నగరంలోని పాలెం పాపయ్య వీధి అంగన్‌వాడీ కేంద్రంలో ఇమ్యూనైజేషన్ సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం వలన వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డాక్టర్లు హరిప్రసాద్, వర్షిత, సింహా, హెల్త్ సూపర్‌వైజర్లు రామాంజనమ్మ, సుబ్బరాయుడు, ఆరోగ్య కార్యకర్త లలితమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎంసీ ఆదాయానికి 'మహానాడు' గండి

– కడప నిండుగా బ్యానర్లు, ఫ్లెక్సీలు
– ప్రకటనల రూపంలో కరువైన ఆదాయం



తిరుపతి బైపాస్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు



మినీ బైపాస్‌లో ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న బ్యానర్

కడప కార్పొరేషన్: అధికార తెలుగుదేశం పార్టీ అట్టహాసంగా నిర్వహించే మహానాడు వేడుకకు కడప ముస్తాబవుతోంది. ఈనెల 27వ తేది నుంచి 29వ తేది వరకూ మహానాడు నిర్వహిస్తుండగా...నాలుగు రోజుల ముందే పసుపు పచ్చని తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులతో కడప నగరం నిండిపోయింది. అయితే ఈ బ్యానర్లు, హోర్డింగులు, ఫ్లెక్సీల మూలంగా ప్రింటర్స్ వారికి, జెండాలు కట్టే కూలీలకు కొంత ఆదాయం సమకూరిందే తప్పా కడప మున్సిపల్ కార్పొరేషన్‌కు నయాపైసా ఆదాయం సమకూరలేదు. లక్షలు ఖర్చు చేసి ఫ్లెక్సీలు, బ్యానర్లకు, హోర్డింగులు కట్టిన టీడీపీ నేతలు కార్పొరేషన్ (కేఎంసీ)కు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారు చలానాలు సక్రమంగా చెల్లించి ఉంటే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న నగరపాలక సంస్థకు లక్షల ఆదాయం సమకూరేది. అయితే చలానాలు కట్టండని అడిగే సాహసం నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు చేయలేదని తెలుస్తోంది. నిబంధనల ప్రకారం కార్పొరేషన్‌కు చలానా చెల్లించాలనే ఆలోచన టీడీపీ నేతలకు లేకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– ఐటీఐ సర్కిల్ నుంచి ఊటుకూరు, ఊటుకూరు నుంచి పబ్బాపురం వరకూ అసలు రోడ్డే కనిపించకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు వేశారు. డివైడర్ల మధ్యలో ఎక్కడ పడితే అక్కడ, విద్యుత్ లైన్లకు అతి సమీపంలో వీటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరికొన్ని గాలులకు ఒరిగిపోయి రోడ్డుపై పడిపోతున్నాయి. విద్యుత్ అధికారులు కూడా ధైర్యం చేసి టీడీపీ నేతలకు చెప్పలేని పరిస్థితి దాపురించింది.

– ఎయిర్ పోర్టు నుంచి ఆలంఖాన్‌పల్లె, వినాయకనగర్, బిల్టప్, ఐటీఐ మీదుగా భారీ స్థాయిలో కనుచూపు మేర ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేశారు. వీటిలో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వారి అనుచరులు ఏర్పాటు చేసినవే అధికంగా ఉన్నాయి. సామాన్యులు ఎవరైనా ఒక ఫ్లెక్సీ కట్టినా, ఒక బ్యానర్ ఏర్పాటు చేసినా ఆగమేఘాల మీద వచ్చి వాటిని చించేసి తొలగించే టౌన్‌ప్లానింగ్ అధికారులు మహానాడు బ్యానర్లు, ఫ్లెక్సీల వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే చలానాలు చెల్లించారని సిటీప్లానర్ చెబుతుండం గమనార్హం.

చలానాలు చెల్లించకపోగా...
కార్పొరేషన్ నిధులే వాడుకుంటున్న వైనం

మహానాడు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలంతా పాల్గొంటున్న నేపథ్యంలో కడప నగరానికి ఎంతో కొంత మేలు జరుగుతుందని ఆశించిన ప్రజానీకానికి నిరాశే ఎదురవుతోంది. ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులకు అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించకుండా కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్న టీడీపీ నేతలు...కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లించిన ప్రజాధనాన్ని కూడా వదలడం లేదు. కార్పొరేషన్ జనరల్ ఫండ్ నుంచి డివైడర్లకు రంగులు వేయడానికి రూ.30లక్షల వరకూ వినియోగిస్తున్నారు. అలాగే రోడ్ల ప్రక్కనున్న కంపచెట్లు, రాళ్లు ఇతర వాటిని జేసీబీలతో తొలగిస్తూ, నగరపాలక సంస్థ సిబ్బందిని, యంత్రాలను, వాహనాలను యథేచ్ఛగా వాడుకుంటున్నారు.

శక్తి యాప్ సేవలు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శాంతమ్మ

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో మహిళలు, విద్యార్థులు శక్తి యాప్ సేవలు వినియోగించుకుని పోలీసు భద్రత పొందాలని కడప శక్తి టీమ్ మహిళా ఎస్ఐ శాంతమ్మ సూచించారు. శనివారం కడప ఎస్.వి ఇంజనీరింగ్ కళాశాలలో శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సందర్భంగా 'శక్తి' బృందం శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మహిళలు , చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాలపై డయల్ 100, 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091,సైబర్ టోల్ ఫ్రి 1930, సైబర్ మిత్ర, సంబంధిత పోలీసు వారికి తక్షణమే సంప్రదించి పోలీసులు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులలో నాణ్యత పాటించాలి



పనుల గురించి ఆరా తీస్తున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప చెన్నూరు బస్టాండ్‌లోని జిల్లా సైన్సు మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం డిప్యూటీ ఈఓ రాజగోపాల్ రెడ్డి డీఈ సుబ్బారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజుల నుంచి సైన్సు మ్యూజియం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీంతో భవనం దెబ్బతినడంతో పాటు సైన్సు మ్యూజియం పరికరాలు కూడా దెబ్బతిన్నాయన్నారు. వీటిని తిరిగి పునః ప్రారంభించే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా సైన్సు మ్యూజియంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సంబంధిత పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ డీఓ వెంట సైన్సు మ్యూజియం క్యూరేటర్ రెహమాన్ ఉన్నారు.

పిచ్చమ్మ ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని శివానంద పురం లో దళిత వృద్ధురాలు పిచ్చమ్మ ఇంటిని కూలివేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగ దాసరి ఇమ్మానియేల్ మునెయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని శివానందపురంలో కూల్చివేసిన పిచ్చమ్మ ఇంటిని డీహెచ్‌పీఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిచ్చమ్మ పై దాడి చేసి ఇంటిని నేలమట్టం చేసిన దౌర్జన్య కారులు బాల గురవయ్యే ఆగడాలకు రిమ్స్ పోలీస్ సిబ్బంది అండగా ఉండడం దారుణమన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులపై ఉక్కు పాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటేశు ప్రసాదు శీను మహేష్ పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే చలో మహానాడు

పేద దళిత వృద్ధురాలు భూమన పిచ్చమ్మ కు న్యాయం చేయకపోతే అఖిలపక్షం ఆధ్వర్యంలో చలో మహానాడు కార్యక్రమం చేపడుతామని సీపీఐ కడప నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. శనివారం సీపీఐ నగర కార్యాలయంలో పిచ్చమ్మ కొడుకు వెంకటసుబ్బయ్యతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివానందపురంలో 5 సెంట్ల స్థలంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న వృద్ధురాలు పిచ్చమ్మ కు నాలుగు లక్షల అప్పు ఇచ్చి మొత్తం ఐదు సెంట్ల స్థలం ఆస్తి కాజేయడానికి కుట్రపన్నిన బాల గురవయ్యపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధి పనులు తనిఖీ



టక్కోలులో కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

సిద్దవటం : మండలంలోని టక్కోలు, కడపాయపల్లె గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన టక్కోలు చెరువులో జరుగుతున్న పూడిక తీత పనులను, కడపాయపల్లెలోని పండ్ల తోటలను, ఫారం పాండ్ పనులను, వర్మీ కంపోస్టు పెట్టెలను, పశువుల నీటి తొట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నీ గ్రామాలలో ఉపాధి హామీ పనులను జరిపించాలన్నారు. అలాగే పనులకు వచ్చిన కూలీలందరికి రూ. 300లు కూలి వచ్చేటట్లు మార్కింగ్ ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ నరసింహులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడపలో టీడీపీ మహానాడు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల ఆకాంక్ష అయిన ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఇండియా కూటమి నేతలు ఎస్. తులసి రెడ్డి, జి ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, జి చంద్రశేఖర్, డాక్టర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఉక్కు సాధన సదస్సును సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువుతో తల్లడిల్లుతున్న రాయలసీమ కేంద్ర బిందువు కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా , పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించవచ్చన్నారు. అలాగే విభజన హామీలు అమలు చేయాలని , పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు ఎన్ వెంకట శివ, వి వీరశేఖర్, ఎల్ నాగ సుబ్బారెడ్డి, పి సుబ్బరాయుడు, జి వలరాజు, ఎస్ విజయలక్ష్మి, జి వేణుగోపాల్, కేసీబాదుల్లా, శ్రీరాములు, గంగా సురేష్, వెంకట్రాముడు, మద్దిలేటి, మునయ్య, పడిగే వెంకటరమణ, భాగ్యలక్ష్మి, బ్రహ్మం, భాస్కర్, ఇమ్మానియేల్, షావలి, యానాదయ్య, సీపీఎం నాయకులు అన్వేష్, ఏఐవైఎఫ్ ప్రభాకర్, నాగేంద్ర, ప్రదీప్ పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఫోరం ఫర్ బెటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సురేష్ బాబు

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలని ఫోరం ఫర్ బెటర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ బాబు, కార్యదర్శి విశ్వనాథ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం కడపలోని ఎస్టీయూ భవన్ లో ఏర్పాటు చేసిన ఫోరం సమావేశంలో వారు మాట్లాడుతూ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ, ఇతర పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కడప – రాజంపేట మధ్య ఐ.టి. కారిడార్ స్థాపన, కడప నుండి ముంబయి, ఢిల్లీ, బెంగళూరు వంటి దేశంలోని ప్రధాన నగరాలకు విమాన సర్వీసుల ప్రారంభం, కడప విమానాశ్రయంలో నైట్ ల్యాండింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు కడప – విజయవాడల మధ్య ప్రత్యేక రైలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయలన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిని మరింత విస్తరించి , కడప నగరం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఫోరం నాయకులు యస్. మహబూబ్ బాష, మస్తాన్ బాబు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎన్‌టీఏ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పదోన్నతులను, బదిలీలను ఎటువంటి అనుమానాలకు, అవాంతరాలకు తావు లేకుండా అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా అధ్యక్షుడు ఏబి రామకృష్ణంరాజు కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఆదేశానుసారం మాన్యువల్ కౌన్సిలింగ్ జరుగుతున్నందున ఉపాధ్యాయులు ఎవరూ అసౌకర్యానికి గురి కాకుండా అన్ని వసతులను కలిపించాలన్నారు. అలాగే బదిలీలను నిర్ణీత సమయంలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బదలీల ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సందేహాల నివృత్తికి ఒక ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీలను నిర్ధారించు సమయంలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా కేటగిరీల వారీగా వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి , ప్రధానోపాధ్యాయులు వి. వేణుగోపాలరావు , ఎన్‌టి ఏ నాయకులు మురళీమోహన్ రాజు, కట్ట గంగాధర్, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో సత్తా



ప్రతిభచాటిన విద్యార్థులతో సంస్థ డైరెక్టర్ బసిరెడ్డి, కరస్పాండెంట్ శివకళ

కడప ఎడ్యుకేషన్: జాతీయస్థాయి సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ పరీక్షల్లో కడప శ్రీ దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ ప్రవేశ పరీక్షల్లో 17 మంది విద్యార్థులు రాత పరీక్షలు రాసి అర్హత సాధించినట్లు ఆ సంస్థ డైరెక్టర్ బసిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా వికాస్ కోచింగ్ సెంటర్ నుండి 17 మంది విద్యార్థిని విద్యార్థులు అర్హత సాధించగా ఇందులో 300 మార్కులకు 260 పైన మార్కులను అఖిలేష్, పవనేశ్వర్ రెడ్డిలు సాధించగా సాయి సాత్విక్ రెడ్డి, భవత్ రెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, నాగార్జున నాయక్, షణ్ముఖలు 200పైన మార్కులు సాధించి ప్రవేశ పరీక్షలో అర్హత పొందినట్లు ఆయన తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను కరస్పాండెంట్ శివకళ, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ఫలితాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను ప్రభుత్వం పరిష్కరించి అమలు చేయాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి కోరారు. శనివారం కడప లోని వీవీఆర్ ఎస్టీయూ భవన్‌లో జరిగిన ముఖ్య సంఘ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధనకు ఉపాధ్యాయ సంఘ నాయకులు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడంతో బాటు రాష్ట్రపతి ఆమోదం కూడా పొందిన విషయాన్నీ గుర్తు చేశారు. నాటి కమిటీలో తాను సభ్యుడిగా పనిచేసినట్లు తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం ద్వారా విద్యారంగం బలోపేతం కావడంతో బాటు ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచుకోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పదోన్నతులు పొందుతారన్నారు. జాప్యం లేకుండా అమలుకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి ఇలియాస్ బాష, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర రెడ్డి, కడప జిల్లా మున్సిపల్ కన్వీనర్ వై.అనిల్ కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిని చంపేసిన ఉన్మాదిని కఠినంగా శిక్షించాలి



విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: సభ్య సమాజం తలదించుకునే విధంగా కంబాలదిన్నెలో పసి కందుపై కామాంధుడు పైశాచిక చర్యకు పాల్పడటం దారుణం అని అటువంటి ఉన్మాదులకు ఉరి శిక్షే సరైన చర్య అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. శనివారం కడపలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రబ్బా నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆది పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మైలవరం మండలం కంబాలదిన్నెలో బాలికను అత్యాచారం చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ అన్నారు. కడపలోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద బాలిక ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ యు నాయకులు హరి, గురు, సందీప్, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

– కంబాలదిన్నె గ్రామంలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఉన్మాది మోరగుడికి చెందిన రహమతుల్లాను వెంటనే ఉరి తీసి చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, అఖిల భారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ డిమాండ్ చేశారు. శనివారం కడప ఓం శాంతి నగర్ లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత అగ్రగామి మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్, హరిత పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: కంబాలదిన్నె గ్రామంలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇలాంటి పాశవిక చర్యలు మన సమాజాన్ని కలచివేస్తున్నాయని, ఇలాంటి నరమృగాలు చేస్తున్న అఘాయిత్యాలను తక్షణమే ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.